క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఆర్డీవోగా రాథోడ్ రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డి ఆర్డీవోగా విధులు నిర్వర్తించిన శ్రీను కల్వకుర్తికి బదిలీ కాగా ఆయన స్థానంలో ఆదిలాబాద్ ఆర్డీవోగా విధులు నిర్వర్తించిన రాథోడ్ రమేశ్ ఎల్లారెడ్డికి బదిలీపై వచ్చారు.

చెవులు మూసుకుని గ్రామస్తుల నిరసన

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేసే వ్యర్థాల నుంచి రక్షించాలంటూ భిక్కనూరు మండలం కాచాపూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 91వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం దీక్ష శిబిరం వద్ద గ్రామస్తులు నిలబడి చెవులు మూసుకుని ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఆస్పత్రికి టీవీ విరాళం



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన హన్మాండ్లు తన తండ్రి, మాజీ సర్పంచ్ మైపత్ సిద్రాం జ్ఞాపకార్థం ప్రభుత్వ ఆస్పత్రికి స్మార్ట్ టీవీని విరాళంగా అందించారు. ఈ సందర్భంగా హన్మాండ్లు మాట్లాడుతూ.. మా నాన్న సర్పంచ్‌గా ఉన్నప్పుడు ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేశారని, రోగులు, వైద్య సిబ్బందికి ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు.

ఈవీఎంలపై అవగాహన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని తిమ్మాపూర్, అడివిలింగాల, కొక్కొండ గ్రామాలలో ఈవీఎం, వీవీ ప్యాట్‌ల గురించి ఎంపీవో ప్రకాష్ అవగాహన కల్పించారు. ఓటు ఏవిధంగా వేయాలో వివరించారు. సర్పంచులు దామోదర్, సువర్ణ, భూమవ్వ, గ్రామస్తులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిది



పిట్లం(జుక్కల్): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని సర్పంచ్ మైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం కుర్తి పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

కామారెడ్డి అర్బన్: జిల్లా గ్రంథాలయంలో పరీక్షలకు సిద్ధమై న్యాయశాఖలో ఉద్యోగం పొందిన బి.రమ్యను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.రాజేశ్వర్ సోమవారం జ్ఞాపిక అందజేసి శాలువాతో అభినందించారు. రమ్య ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పోటీ పరీక్షలకు సిద్ధపడేవారని, కామారెడ్డి కోర్టులో ఉద్యోగం రావడం సంతోషంగా ఉందని చైర్మన్ రాజేశ్వర్ అన్నారు. గ్రంథాలయ సంస్థ సిబ్బంది గణపతి, కపిల్, వసంత, మమత బీఆర్ఎస్ నాయకులు పంపరి శ్రీనివాస్, కొత్తింటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ



బాన్సువాడ: వారధి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్ మాట్లాడుతూ.. వారధి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్ కిట్లను అందజేయడం హర్షణీయమని అన్నారు. ఆరు నెలలుగా ప్రతి రోజు 11 మంది బాధితులకు న్యూట్రిషన్ ఫుడ్ కిట్లను అందజేస్తున్నారని తెలిపారు. వారధి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ఠాకూర్ గోపాల్‌సింగ్, ప్రతినిధులు కిషన్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, అనీల్, శరత్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న పార్ట్‌టైం స్వీపర్ల నిరసన దీక్షలు

కామారెడ్డి రూరల్: కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం పార్ట్ టైం స్వీపర్లు ఒంటికాలిపై నిలబడి తమ నిరసనను వ్యక్తం చేశారు. స్వీపర్ల రిలే దీక్షలు 21వ రోజుకు చేరుకున్నాయి. ఉద్యోగ భద్రత కల్పించి రూ.27 వేల వేతనం చెల్లించాలని, చనిపోయిన స్వీపర్స్ స్థానంలో వారి వారసులను నియమించాలని, విద్యార్హత ఉన్నవారికి అటెండర్‌లుగా నియమించాలన్నారు. బాలయ్య, సిద్ధిరాములు, సహదేవ్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం

- సభ్యులే సంఘానికి ఊపిరి
- జిల్లా అధ్యక్షుడు దామోదర్ రెడ్డి



భిక్కనూరులో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

భిక్కనూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన భిక్కనూరు బాలికల ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యులే సంఘానికి ఊపిరి అని, సంఘం ఉన్నతికి సభ్యుల సహకారం ఎంతగానో అవసరం ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. పీఆర్‌టీయూ పోరాటం వల్లే నేడు ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలను కల్పించిందన్నారు. దేశంలోనే ఎక్కువ మంది సభ్యులు పీఆర్‌టీయూలోనే ఉన్నారన్నారు. ఈ యూనియన్‌తోనే చాలా సమస్యలు పరిష్కారమయ్యాయని అన్నారు. పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు శ్రీరంగం శ్రీనివాసచారీ, ప్రధాన కార్యదర్శి పేష్కారి గిరిధర్, నేతలు బాపురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమేశ్, మాధవి, లత తదితరులున్నారు.

ఆడపిల్ల పుడితే బాధపడే రోజులు పోయాయి

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- జిల్లా కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్

కామారెడ్డి క్రైం: ఆడపిల్ల పుడితే బాధపడే రోజులు పోయాయని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో సోమవారం 276 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ మాట్లాడుతూ.. ఆడపిల్లలను కూడా మగ పిల్లలతో సమానంగా పెంచాలన్నారు. రెండోసారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు కామారెడ్డి నియోజకవర్గంలో రూ.91 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ఇళ్ల పరిశీలన



పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి వరదారెడ్డి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లను ప్రత్యేక అధికారి, జిల్లా ఫిషరీస్ ఆఫీసర్ వరదారెడ్డి సోమవారం పరిశీలించారు. 58, 59 జీవోల ప్రకారం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రెగ్యులరైజేషన్ ప్రక్రియలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లను పరిశీలించారు. సంబంధిత నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందించనున్నట్లు వరదా రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, గిర్దావార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా ?



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బీబీపేట: మండలానికి జూనియర్ కళాశాల తెచ్చేది కచ్చితంగా బీఆర్ఎస్ ప్రభుత్వమే తప్ప కాంగ్రెస్ కాదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చెల్లాపురం వెంకట్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. మండలం సాధించిన సమయంలో కాంగ్రెస్ నేత ఏం చేసిందీ లేదని ఇప్పుడు కళాశాల ఎలా తీసుకువస్తారని ఎద్దేవా చేశారు. బీబీపేటను అన్ని రకాలుగా అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని దీనిపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ నాయకులు సిద్ధమైతే బీబీపేట ప్రధాన చౌరస్తాలోకి మాజీ మంత్రి షబ్బీర్ అలీని తీసుకురావాలని అన్నారు. అవగాహన లేకుండా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు మండలం, కళాశాల కోసం చేసిన తీర్మానాల కాపీలను చూపించాలని అన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులకు శ్రీకారం



పిట్లంలో పనులు చేస్తున్న కూలీలు

నిజాంసాగర్(జుక్కల్): పంచాయతీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రైవేటు కూలీలతో సంపూర్ణ పారిశుధ్య పనులకు జీపీ అధికారులు శ్రీకారం చుట్టారు. పారిశుధ్యం.. అస్తవ్యస్తం అంటూ సోమవారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి పిట్లం జీపీ సిబ్బంది స్పందించారు. పక్క గ్రామాల్లోని ప్రైవేటు కూలీలతో పారిశుధ్య పనులు చేయించారు. పారిశుధ్య పనులు చేపట్టడంతో పిట్లం పట్టణ ప్రజలు, వ్యాపారులు సాక్షికి అభినందలు తెలిపారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నాగిరెడ్డిపేటలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు



పిట్లంలో..

రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్ఏలకు పేస్కేల్ ఇవ్వడంతో పాటు, రెగ్యులరైజేషన్ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో సోమవారం జిల్లా వ్యాప్తంగా వీఆర్ఏలు హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్ చిత్రపటాలకు ప్రధాన వీధుల్లో పాలాభిషేకం చేశారు. కారుణ్య నియామకాలు చేపడతామని ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో సంతోషం వ్యక్తం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

జీపీ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం



మద్దతు తెలుపుతున్న షబ్బీర్ అలీ

బీబీపేట: జీపీ కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వారు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో వారి సేవలను వినియోగించుకొని ఇప్పుడు వారి న్యాయమైన డిమాండ్లను నేరవేర్చకపోవడం శోచనీయమన్నారు. కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

సంఘాలు మరింత అభివృద్ధి చెందేలా చూడాలి



మాట్లాడుతున్న ఏపీఎం రవీందర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాల్లో ఉన్న అర్హులైన సంఘాలకు రుణాలు ఇప్పించి, ఆ సంఘాలు మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని ఐకేపీ ఏపీఎం రవీందర్ అన్నారు. తాడ్వాయి ఐకేపీ కార్యాలయంలో సోమవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా 10లోపు చెల్లించిన సంఘాలకు మాత్రమే పావలా వడ్డీ వర్తిస్తుందన్నారు.

సమాచారం..

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో కొత్తగా మంజూరైన డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్ర ముఖర్జీ తెలిపారు. వచ్చే నెల 11 వరకు ఆన్‌లైన్ దోస్త్ ద్వారా డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. బీఏ, బీకాం, బీఎస్సీ, లైఫ్ సైన్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ ఇంగ్లీష్ మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వంటమనిషి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కస్తూర్బా పాఠశాలలో వంట మనిషి పోస్టుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ వీణ సోమవారం తెలిపారు. ఈ నెల 27లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అతిథి కొలువులు

బాన్సువాడ రూరల్: శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఐ.గంగాధర్ తెలిపారు. పోస్టుగాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు, నెట్, స్లెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి నియామయంలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇంగ్లీష్-2, తెలుగు-2, కంప్యూటర్ సైన్స్ -2 ఉర్దూ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, గణితం, క్రాప్ ప్రొడక్షన్ ఒక్కొక్కటి చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. అలాగే ఉర్దూమీడియంలో హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, ఉర్దూ, ఉర్దూ కెమిస్ట్రీ, బాటనీ, జూవాలజీ ఇలా మొత్తం 17 ఖాళీలు ఉన్నాయన్నారు. 28లోపు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 1న కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

జీవనభృతి కల్పించాలని ఆర్డీవోకు వినతి



వినతి పత్రం అందజేస్తున్న సత్యం, బీడీ కార్మికులు

కామారెడ్డి రూరల్: కొత్త పీఎఫ్ ఉన్న ప్రతి బీడీ కార్మికురాలికి జీవనభృతి కల్పించాలని కోరుతూ సోమవారం తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం ఆధ్వర్యంలో ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ 2014 తర్వాత పీఎఫ్ ఉన్న బీడీ కార్మికులందరికి జీవన భృతి అందిస్తానని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయడం లేదన్నారు. వైద్య సదుపాయం కల్పించాలని, బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.10 లక్షలు అందించాలన్నారు. డిమాండ్లు నెరవేర్చకుంటే ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య బోధకుడు దస్తీరాం మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. పాఠశాల ఆవరణలో చుట్టు పక్కల మురికి నీరు నిలువ ఉండకుండా చూడాలని, ప్రతి రోజు క్లోరినేషన్ చేసిన నీటిని అందించాలని ప్రిన్సిపాల్ రాగిణికి సూచించారు. దోమలు రాకుండా కిటికీలకు దోమ తెరలు ఏర్పాటు చేయాలని, జ్వరం వచ్చిన వెంటనే ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని టీచర్లకు సూచించారు.

ఘనంగా మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు



ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సురేందర్



బాన్సువాడలో.. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రాల్లో, స్కూళ్లలో కేకులు కట్ చేసి పంచిపెట్టారు. పలు చోట్ల మొక్కలు నాటారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



దోమకొండలో ..

ఎంఎస్ఎఫ్ సన్నాహక సదస్సు కరపత్రాల ఆవిష్కరణ



బాన్సువాడలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

బాన్సువాడ: కామారెడ్డిలో ఈ నెల 27న జరిగే ఎంఎస్ఎఫ్ జిల్లా సన్నాహక సదస్సుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం బాన్సువాడలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత సాధించే ఆశయ సాధనలో అంతిమ యుద్ధానికి మాదిగ సమాజం సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్, శ్రీకాంత్, సురేష్, సాయి, విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి



ఎల్లారెడ్డి: మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు



తాడ్వాయిలో మోకాళ్లపై కూర్చొని నిరసన..

తాడ్వాయి/ఎల్లారెడ్డి/భిక్కనూరు/దోమకొండ/రాజంపేట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 19వ రోజుకు చేరుకుంది. పలు పార్టీల నాయకులు కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. వెంటనే ప్రభుత్వం దిగి వచ్చి కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చాలని అన్నారు. జీవో-60 ప్రకారం కనీస వేతనం చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా కల్పించాలని అన్నారు.

సంకల్ప రథయాత్రను విజయవంతం చేయండి



నాగిరెడ్డిపేట: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీఎస్‌సీపీఎస్‌ఈయూ సభ్యులు



పిట్లం: మద్దెల్‌చెరువులో ..



లింగంపేటలో..

ఓపీఎస్ సాధన కోసం కామారెడ్డిలో మంగళవారం జరుగనున్న సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ సభ్యులు కోరారు. సోమవారం వారు నాగిరెడ్డిపేట, పిట్లం, లింగంపేటలలో రథయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓపీఎస్ సాధన కోసం మంగళవారం కామారెడ్డిలో మధ్యాహ్నం ఒంటి గంటకు బైక్ ర్యాలీ, 2 గంటలకు రాజారెడ్డి గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించనున్నామన్నారు. నూతన పెన్షన్ పథకం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్తం

ఎల్లారెడ్డి సీఎస్ఐ చర్చి ఫాదర్‌గా రెవరెండ్ ప్రభాకర్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి సీఎస్ఐ ఫాదర్‌గా రెవరెండ్ ప్రభాకర్ బాధ్యతలను స్వీకరించినట్లు చర్చి సిబ్బంది తెలిపారు. ఎల్లారెడ్డి సీఎస్ఐ చర్చి ఫాదర్‌గా విధులు నిర్వర్తించిన రెవరెండ్ ప్రసాద్ పోచంపాడ్ చర్చికి బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రభాకర్ వచ్చినట్లు వారు తెలిపారు.

మైనార్టీలకు నిధులు కేటాయించాలి

రాజంపేట: మండల కేంద్రంలోని మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సోమవారం మండల మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బోరుగడ్డ ప్రాంతంలోని ఈద్గాకు సీసీ రోడ్డు, ప్రహరీ, బస్టాండ్ ఆవరణంలోని దర్గాకు సీసీ రోడ్డు నిర్మాణం, శ్మశానవాటికకు విద్యుత్ సౌకర్యం కల్పించి మైనార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. అప్సు, అఫీజ్, షేర్ మజీద్ పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

రామారెడ్డి: కొత్తగా పట్టాదార్ పాసు పుస్తకాలు వచ్చిన వారు రైతు బీమా చేయించుకోవాలని ఏఈవో హరీష్‌కుమార్, రామారెడ్డి వ్యవసాయ క్లస్టర్ ఏఈవో రాకేష్ సూచించారు. పాస్ బుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లు, రైతు బీమా దరఖాస్తు ఫారం సమర్పించాల్సి ఉంటుందని ఏఈవో హరీష్‌కుమార్ పేర్కొన్నారు.

ఇసుక వేలం పాట

బిచ్కుంద(జుక్కల్): హాజ్గుల్‌లో మూడు రోజుల క్రితం అక్రమంగా డంపు చేసిన ఇసుక కుప్పలను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఇసుక కుప్పలకు సోమవారం వేలం పాట నిర్వహించారు. వేలం పాటతో ప్రభుత్వానికి రూ.18,900 ఆదాయం వచ్చిందని ఆర్ఐ సాయిబాబా తెలిపారు.

తప్పకుండా లైసెన్స్ తీసుకోండి

కామారెడ్డి టౌన్: పట్టణంలోని సెప్టిక్ ట్యాంక్ వాహన యజమానులు మున్సిపల్ నుంచి లైసెన్స్ పొందాలని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ సోమవారం తెలిపారు. లైసెన్స్ లేకుండా పనులు చేపడితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వివరాలకు 7382330111, 8688110783.

నీటినిల్వలు లేకుండా చూడాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామంలో ఎక్కడా కూడా నీటినిల్వలు లేకుండా చూడాలని ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. రాఘవపల్లి జీపీ కార్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. మురికి కాలువల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని చెప్పారు. కార్యదర్శి క్రిష్ణమూర్తి ఉన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుడికి నివాళి

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుడు డాక్టర్ మదన్‌మోహన్‌లాల్‌కు సోమవారం ఘన నివాళులర్పించారు. మదన్ అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందాడు. కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా, ప్రతినిధులు నరసయ్య, సరిత పాల్గొన్నారు.

గౌడ హాస్టల్ అధ్యక్షుడికి సన్మానం

కామారెడ్డి టౌన్: హైదరాబాద్‌లోని గౌడ హాస్టల్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడిగా కామారెడ్డికి చెందిన చక్రవర్తిగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో సోమవారం ఆయనను ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛ అందజేసి శాలువాలతో సత్కరించారు. కాటమయ్య గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్కోల్ లక్ష్మి నర్సాగౌడ్, గౌరవ అధ్యక్షుడు బాలార్జున్‌గౌడ్, తదితరులున్నారు.